క్లుప్తంగా

ముగిసిన గంగాలమ్మ జాతర

రౌతులపూడి: మండలంలోని గుమ్మరేగుల శివారు కోళ్ల రవిబాబు వ్యవసాయ క్షేత్రం వద్ద నిర్వహించిన గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ వేడుకుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం ప్రజలను అలరింపజేసేందుకు తప్పెడ గుళ్లు, కోలాటం, భజనలు, వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సమీపంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



ఏలేశ్వరంలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: మొక్కలతోనే పర్యావరణాన్ని సంరక్షించ వచ్చని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పట్టణంలో ఆదివారం వనమహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ ఓ బాధ్యతగా భావించాలన్నారు. పర్యవరణ ముప్పుతో భావితరాలకు నష్టం జరగకుండా విధిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలతో పర్యవరణ సమతుల్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మూదినారాయణస్వామి, పెంద్ర శ్రీను, కడింశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారి జన్మదిన వేడుకలు

రౌతులపూడి: అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్ జన్మదిన వేడుకులను ఆ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో మండలంలోని గిడజాం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి అభిమానులకు, సంస్థ ప్రతినిధులకు పంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు కోసం సునీల్ కుమార్ చేస్తున్న సేవలు అమోఘమన్నారు. ఆయన సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేసేందుకు ఎయిమ్స్ ప్రతినిధులంతా కృషిచేయాలన్నారు. మహిళలు, ఎయిమ్స్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కరాటేలో లంపకలోవ విద్యార్థి ప్రథమ స్థానం



నిర్వాహకుల నుంచి మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి కార్తీక్

ప్రత్తిపాడు: ఇటీవల జగ్గంపేటలో నిర్వహించిన 30వ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2025 పోటీలలో ప్రత్తిపాడు మండలం లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థికి ప్రథమ స్థానం లభించింది. సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే-డు-అకాడమి ఈ పోటీలను నిర్వహించినట్టు కరాటే స్కూల్ మాస్టార్ పి.బుజ్జి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఒమ్మంగి శ్రీ భారతి విద్యా నికేతన్ విద్యార్థి ఎస్.కార్తీక్ ప్రథమ స్థానాన్ని గెలుచుకున్నాడన్నారు. కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తీక్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది. భవిష్యత్తులో మరెన్ని పతకాలు సాధించాలన్నారు.

పుష్కర కాలువలో పూడికతీత పనులు



పూడిక తొలగింపు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు పుష్కర ప్రధాన కాలువలో పూడికతీత, తుప్పలు, పిచ్చి మొక్కలను తొలగింపుకై ఆదివారం పనులు ప్రారంభించినట్టు ఇరిగేషన్ అధికారులు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుష్కర నీటి సంఘాల ప్రాజెక్టు చైర్మన్ అడబాల భాస్కరరావు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ రమణమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకు వంతెనపై ప్రయాణించేదెలా..?

- ప్రమాదకరంగా తామరాడ–గోనేడ వంతెన
- దెబ్బతిన్న వంతెన రక్షణ గోడ
- ప్రమాదం అంచున విద్యార్థుల రాకపోకలు



ఊచలు పైకి లేచి ప్రమాదంగా మారిన వంతెన



తామరాడ-పాలెం ఇరుకు వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

కిర్లంపూడి: అసలే ఇరుకు వంతెన, ఆపైన ఇరువైపులా దెబ్బతిన్న రక్షణగోడ, పెరిగిన ట్రాఫిక్‌తో వారధి ప్రమాదాలకు నెలవుగా మారింది. మండల పరిధిలో తామరాడ–గోనేడ ఏలేరు కాలువపై వంతెన ప్రయాణికుల పట్ల శాపంగా మారింది. ముక్కొల్లు, రాజుపాలెం, వీరవరం, రామచంద్రపురం, తామరాడ, ఎస్.తిమ్మాపురం, శృంగరాయుని పాలెం గ్రామాల ప్రజలు జాతీయ రహదారికి, నియోజకవర్గం కేంద్రమైన జగ్గంపేటకు రాకపోకలకు ఇది ప్రధాన రహదారి కావడంతో వంతెనపై ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. నాటి ప్రజల అవసరాలకు అనుగుణంగా తక్కువ వెడల్పుతో వంతెన నిర్మించారు. ప్రస్తుతం జనాభా, వాహనాల రద్దీ వీపరితంగా పెరిగింది. దీంతో ఈ వంతెనపై ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చే సామార్థ్యం లేకపోవడంతో ఒక వాహనం వెళ్లిన తర్వాతే మరో వాహనం రావాల్సి ఉంటుంది. ఇరుకు వంతెనకు తోడు ఇరువైపులా రక్షణ గోడ శిథిలవ్యవస్థకు చేరుకోవడంతో వాహనదారులకు ఈ వంతెనపై ప్రయాణం చేయాలంటే కత్తిపైసాములా మారింది.

నిత్యం రద్దీ

ఏలేరు కాలువలోని ఇసుకను ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెన ప్రధాన మార్గం. సోమవరం, బూరుగుపూడి, కృష్ణవరం, సోమరాయణంపేట, పాలెం, గోనేడ గ్రామాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు మండల కేంద్రమైన కిర్లంపూడి, పెద్దాపురం మీదుగా కాకినాడ వెళ్లేందుకు ఈ వంతెనపై నుంచే ఆటోలు, వాహనాలు, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఏటిపట్టు ప్రాంతాల్లో ఇటుక బట్టీలు, చేపలు చెరువులు ఉండటంతో లోడ్ వాహనాలతో నిత్యం ఈ వంతెన రద్దీగా ఉంటుంది. తామరాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వందలాది సంఖ్యలో విద్యార్థులు ఈ వంతెన గుండానే సైకిళ్లు, కాలినడకన ప్రయాణిస్తుంటారు. పెరిగిన ట్రాఫిక్, శిథిలమైన రక్షణ గోడతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా మారిన వంతెన

నత్తనడకన నిర్మాణ పనులు

రాజుపాలెం నుంచి తామరాడ–పాలెం వంతెన మీదుగా రామవరం వెళ్లే రహదారి విస్తరణ పనులు సుమారు రూ.30 కోట్లతో ప్రారంభించినా అది నత్తనడకన సాగుతుంది. రహదారి పూర్తి అయిన తరువాతనైనా వంతెన మరమ్మతులు చేపడతారేమోనని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ప్రమాదాల బారి నుంచి బయటపడేలా వంతెనకు మరమ్మతులు చేయాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను ప్రయాణికులు వేడుకుంటున్నారు.

రక్షణ గోడనూ నిర్మించాలి



వంతెన రక్షణ గోడ బాగు చేయాలి. రాత్రి వేళల్లో వంతెన పూర్తిగా కనిపించే విధంగా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలి. పలుచోట్ల రక్షణ గోడకూలిపోయింది. వంతెనపై గోతులు ఏర్పడి కంకర లేవడంతో ఊసలు బయటకు వచ్చి ప్రమాదంగా మారాయి. మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– బొడ్డేటి అప్పారావు, పాలెం.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్, దోమల మందు పిచకారి చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా పారిశుద్ధ్య అధికారులు పని చేయాలని సూచించారు.

500 కేజీల నల్లబెల్లం సీజ్

ప్రత్తిపాడు: శంఖవరం మండలం అన్నవరం జాతీయ రహదారిపై ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం మేరకు అన్నవరం ఎస్‌హెచ్‌పై తమ సిబ్బంది రూట్ వాచ్ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 500 కేజీల నల్లబెల్లాన్ని గుర్తించి ఆటోను సీజ్ చేశామన్నారు. ఈ సంఘటనలో కేలోతు భావు సింగ్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన గంపల మణికంఠ స్వామి, రాచపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌లు పరారయ్యారని పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని సీఐ తెలిపారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



తేటగుంటలో కేంద్రం పథకాలను రైతులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్

తుని రూరల్: వ్యవసాయం రంగంలో నూతన సాంకేతికత, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు అందిపుచ్చుకోవాలని రాజమండ్రి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.కె.ప్రసాద్ అన్నారు. ఆదివారం తుని మండలం తేటగుంట రైతు సేవా కేంద్రంలో కల్వచర్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ బి.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ పాల్గొని పీఎం కిసాన్, ఫసల్ భీమా యోజన, ఆర్‌కేవీవై, రైతు ఉత్పాదక సంస్థలు, ఈ–నాం, భూసార పరీక్షా ఫలితా కార్డులు, జాతీయ ఆహార భద్రత, తదితర సంక్షేమ, సాంకేతిక పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. హెచ్ఓ జి.విజయలక్ష్మి, డాక్టర్ బి.ఎస్.రెడ్డి, డాక్టర్ రవి, ఆత్మ బీటీఎం బాబురావు, ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, వ్యవసాయ, ఉద్యానశాఖల అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు ప్రత్తిపాడు విద్యార్థి



వేముల సాయి శరణ్య

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థలకు చెందిన వేముల సాయి శరణ్య ఎంపికై నట్టు యాజమాన్యం తెలిపింది. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో 583 మార్కులు సాధించిన వేముల సాయి శరణ్య ఈ అవార్డుకు ఎంపికై ందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ సీహెచ్ ఆనందకుమార్ జోషి, మట్టపర్తి లక్ష్మణ్‌కుమార్ అభినందించారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో..



పట్టణంలోని అధ్వానంగా సాయినగర్, ఎస్.అన్నవరం శివారు శేషాద్రి నగర్ ప్రధాన రహదారి

తుని: తుని పట్టణం సాయినగర్, ఎస్.అన్నవరం శివారు శేషాద్రి నగర్ సరిహద్దు రహదారి అధ్వానంగా ఉంది. చినుకుపడితే రోజులు తరబడి వర్షపు నీరు నిల్వ ఉండి బురదమయమవుతుంది. అటుగా వెళ్లే వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శేషాద్రి నగర్ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే అపార్టుమెంట్లు, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో గజం స్థలం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతుందంటే ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతుంది. అంతవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికి రోడ్లు, కాలువల అభివృద్ధికి నోచుకోవడంలేదు. లే అవుట్ దారులు, బిల్డర్లు వేసిన రోడ్లు ధ్వంసమవడంతో ఆ ప్రాంతాలలో నివాసం ఉంటున్న గృహస్తులకు వర్షాలు కురిస్తే రాకపోకలుకు కష్టమవుతుంది. అధికారులు స్పందించి సరిహద్దులో పటిష్టమైన రహదారి, కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

ఏలేరులో తగ్గుతున్న నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో ఏలేరు జలశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటిసరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో నీటినిల్వలు తగ్గుతున్నాయి. దీంతో దిగువ ఆయకట్టుకు నీటి సరాఫరానూ అధికారులు తగ్గించారు. ఈ మేరకు ఆదివారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 76.56 మీటర్లు, 24.11 టీఎంసీలకు 9.76 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి విశాఖకు 150 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. దిగువ ఆయకట్టుకు, పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి సరాఫరా నిలిపివేశారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేటలో సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహన్‌రావు ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో గడ్డిపేట గ్రామశివారులో కె.లోవరాజు సారాతో వెళ్తుండగా సిబ్బంది వెళ్లి పట్టుకున్నారన్నారు. అతడిని అరెస్టు చేసి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

వాహనాల రికార్డులు తప్పనిసరి



ఒంటిమామిడి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై జగన్మోహన్‌రావు, సిబ్బంది

తొండంగి: వాహనదారులు వాహనాల రికార్డులను తప్పకుండా తమతో ఉంచుకోవాలని ఎస్సై బి.జగన్మోహన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని ఒంటిమామిడి బీచ్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్, పొల్యూషన్ వంటి పత్రాలను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని పలువురు వాహనదారులకు అపరాధ రుసుములు విధించారు. వాహనాల రికార్డులను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు ప్రమాదాల నివారణకు హెల్మెట్, కారు సీట్ బెల్ట్ ధరించాలని వాహనచోదకులకు ఆయన సూచించారు.

సూర్య ప్రతాపం



ఏలేశ్వరంలో ఎండ తాపానికి నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- ఎండతీవ్రతతో ఇబ్బందులు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

ఏలేశ్వరం: వేసవి తాపానికి నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలకు ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా జనసంచారం తగ్గింది. శుభ కార్యక్రమాలు ఉండడంతో ప్రజలు నానాయాతనలు పడ్డారు. జాతీయరహదారిపై మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు వాహనాల రాకపోకలు తగ్గాయి. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం రోడ్డు, హనుమాన్ జంక్షన్, లింగంపర్తిరోడ్ జనం లేక వెలవెలబోయాయి. మే నెలలో వర్షాలు పడి, జూన్‌లో ఎండలు కాస్తుండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



సామ్రాజ్య దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రబోధన్ ప్రముఖ్ రామచంద్రరావు

తుని రూరల్: భారతదేశ పౌరులందరూ దేశభక్తితో మెలగాలని, ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ విభాగ్ కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ రామచంద్రరావు అన్నారు. ఆదివారం తుని పట్టణం చిన్నవీధిలోగల వాసవీ క్లబ్ ఆవరణలో తుని ఖండ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఛత్రపతి శివాజీ వీరోచిత చరిత్రను వివరించారు. నేటి యువత శివాజీ చరిత్రను ఆదర్శంగా తీసుకుని జీవించాలన్నారు. నిత్యం అభ్యాసనంతో అత్యుత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. తుని ఖండ కార్యనిర్వహకుడు వి.ప్రసాద్, ములగల విజయ కుమార్, చదరం నర్సింగరావు, కుందె సత్యనారాయణ, పంపనబోయిన గోవిందు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక

గండేపల్లి: మండలంలోని అదృశ్యమైన బాలికను తల్లితండ్రులకు అప్పగించినట్టు సీఐ వై.ఆర్కే. శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సుబ్బయమ్మపేటకు చెందిన 17 సంవత్సరాల అనామిక అనే బాలిక అదృశ్యమైనట్టు ఆదివారం ఉదయం పదకొండు గంటలకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఎస్సై యువి శివ నాగబాబు, ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానంతో ఐదు గంటల వ్యవధిలో బాలికను విశాఖలో ట్రేస్ చేసి సురక్షితంగా తల్లితండ్రులకు అప్పగించినట్టు తెలిపారు.

11న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. సీనియర్స్ విభాగంలో ఈ ఎంపికలు ఉంటాయన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే అంతర్ జిల్లాల అథ్లెటిక్స్‌లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఈ ఎంపికలకు 2007 ఆగస్టు 20 తేదీ ముందు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

రహదారిపై వెలగని దీపాలు



నీలాద్రిరావుపేటలో రహదారిపై వెలగని దీపాలు

గండేపల్లి: మండలంలోని రహదారిపై దీపాలు వెలగక వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నీలాద్రిరావుపేట నుంచి ఆంధ్రాబ్యాంక్ వరకు రహదారిపై దీపాలు వెలగకపోవడంతో చీకటిపడితే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఆందోళన పడాల్సిన పరిస్థితి నెలకొంది. విశాఖ, విజయవాడ వైపు రాకపోకలు సాగించే వాహనాల రద్దీతో రహదారి ఎప్పుడూ బిజీగా ఉంటుందని, రహదారిని దాటి వెళ్లాలంటే ఏ ప్రమాదం సంభవిస్తోందో తెలియక భయపడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. నీలాద్రిరావుపేటలో, ఆదిత్య ఆసుపత్రి వద్ద రోడ్డు దాటేందుకు మార్గాలు ఉన్నాయి. రహదారికి ఇరువైపుల నివాసం ఉంటున్న స్థానికులు తమ అవసరాల నిమిత్తం ఈ మార్గాల నుంచే రోడ్డు దాటాల్సి ఉంది. అయితే రాత్రి సమయాల్లో రహదారికి మధ్యలో ఏర్పాటు చేసిన దీపాలు వెలగకపోవడంతో అత్యవసరం అయినప్పటికి అటుగా వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఆదిత్య ఆసుపత్రి నుంచి ఆంధ్రాబ్యాంక్ వరకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డులు నిత్యం జన సంచారం, ద్విచక్ర వాహనాలతో రద్దీగా ఉంటుంది. బ్రిడ్జ్‌పైన ఏర్పాటు చేసిన దీపాల వెలుగు ఈ సర్వీస్ రోడ్డులో పడటంతో ఆ మార్గంలో ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని, కొన్ని రోజులుగా దీపాలు వెలగపోవడంతో భయపడుతూ వెళ్లాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు



సామర్లకోట మద్రాసు హైకోర్టు జడ్జి దంపతులకు ఆశీర్వచనాలు అందజేసిన ఆలయ పండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని మద్రాసు హైకోర్ట్ జడ్జి ఎన్.మాల దంపతులు, కమిషనర్ ఆఫ్ యూత్ సర్వీసెస్ (విజయవాడ) కె.శారద దర్శించుకున్నారు, ఆలయానికి వచ్చిన వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో కాలభైరవ స్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూల విరాట్‌లతో పాటు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. పూజల అనంతరం వారికి ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. వారికి స్వామివారి ప్రసాదం, ఫొటోలను ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు అందజేశారు.

26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు

కాకినాడ రూరల్: గంగనాపల్లి వారాహి నగర్‌లోని శ్రీవారాహి అమ్మవారి ఆలయంలో ఈ నెల 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఉత్సవాల కోసం పందిరి రాట వేసి, ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. రోజూ తెల్లవారు జామున 3.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, రాత్రి 7 గంటలకు అమ్మవారికి మూల నక్షత్ర, చండీ హోమాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

సామర్లకోట: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సుమారు 40 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ బాస్కెట్‌బాల్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడలకు విద్యార్థులు కొంత సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. బాస్కెట్‌బాల్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. గుడ్ ఫ్రెండ్స్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 13 ఏళ్లుగా సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ సభ్యులు ఎండీవీ ప్రసాద్, గిడ్ల దేవానంద్, గిరిధర్‌గోపాల్, ఊబా జాన్‌కెనడీ, బి.రాంబాబు, జి.లోవకుమార్, సంజీవరావు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.